నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 17 జనవరి 2025 | HYDERABAD



గురువారం మాదాపూర్‌లోని శిల్పారామం సరస్సులో ఆహ్లాదకరంగా పడవలపై విహరిస్తున్న పర్యాటకులు



మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం యాంఫీ థియేటర్‌లో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు





## కేటీఆర్‌కు బాసటగా..

ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఉదయం పదిన్నరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరవుతున్నారనే సమాచారం తెలుసుకొని బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోలీసులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను, మాజీ ఎమ్మెల్యేలను, కార్యకర్తలను ఎక్కడికక్కడే ఆపేశారు. పలువురు నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. - సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ):









# ఇండ్ల లబ్ధిదారులపై సర్కారు కక్ష

ఇంట్లో ఉంటారా? ఇండ్లను రద్దు చేయమంటారా?

### నోటీసులు జారీ చేస్తాం

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు అధికారుల హెచ్చరికలు

మౌలిక వసతులు కల్పించకుండానే సర్వే పేరుతో భయపెడుతున్న అధికారులు

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష గట్టింది. ఇండ్లను పొందిన అర్హులంతా రెండు పడక గదుల ఇంటిలో ఉండాల్సిందేంటూ హుకుం జారీ చేస్తున్నారు. లేదంటే కేటాయించిన ఇండ్లను రద్దు చేస్తామంటూ హెచ్చరికలు సైతం జారీ చేస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన కొన్ని రోజులుగా జీహెచ్ఎంసీ, రెవెన్యూ విభాగం అధికారులు డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయాలపై సర్వే చేస్తున్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రాజెక్టుల్లో ఎన్ని కేటాయింపులు జరిగాయి? వారు అర్హులేనా? అనర్హులు ఉన్నారా? లబ్ధిదారులు ఇతరులకు అమ్ముకున్నారా? కేటాయించిన ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ప్లాట్లు ఎన్ని ఉన్నాయి? అనే నిగ్గుతేల్చేందుకు క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగానే మౌలిక సదుపాయాలు సరిగా లేక కొందరు, ఆర్థిక, రవాణా సదుపాయాల దృష్ట్యా కేటాయించిన ఇండ్లలోకి వెళ్లలేక కొందరు, పిల్లల చదువుల దృష్ట్యా సిటీలో ఉంటున్న మరికొందరు కేటాయించిన ఇండ్లలో వెళ్లేందుకు దూరంగా ఉంటూ వస్తున్నారు. వీరినే లక్ష్యంగా చేసుకుని అధికారులు ప్రతి ఒక్కరూ లబ్ధిదారులు వారి వారి డబుల్ బెడ్‌రూం ఇండ్లలో ఉండి తీరాల్సిందేనని ఆదేశాలు జారీ చేస్తుండడం పట్ల లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడే ఆయా ప్రాజెక్టుల్లో అసోసియేషన్ ప్రతినిధులు సైతం నిర్వహణ పేరిట లబ్ధిదారుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### సమున్నత ఆశయానికి గండి

నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న బలమైన సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం 111 చోట్ల లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ఉన్న చోటనే 27 ప్రాంతాల్లో (ఇన్ సైట్)లో 5,363 మందికి, 39 లోకేషన్లలో 63,478 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను అందజేసిన సంగతి తెలిసిందే. లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకంలో 66 లోకేషన్లలో మొత్తం 68,841 మందికి పట్టాలు అందజేశారు. అయితే కార్పొరేట్ స్థాయిలో ఈ ప్రాజెక్టులో మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. కొన్ని చోట్ల కరెంట్ కనెక్షన్, కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్‌నెట్, ఇతర మెయింటనెన్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా కేసీఆర్ సర్కారు హెచ్ఎండీఏ నుంచి రూ. 100 కోట్లను జీహెచ్ఎంసీకి బదలాయించింది. నిబంధనల ప్రకారమే జీహెచ్ఎంసీ ఖజానాలోకి రూ.100 కోట్లు వచ్చి చేరాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నిధులను జీహెచ్ఎంసీ ఇతర వాటికి మళ్లించింది. ఫలితంగా మౌలిక వసతుల కల్పనలో జాప్యం చేస్తూ వస్తున్నది. లబ్ధిదారులు వరుస ఆందోళన చేస్తున్న కొన్ని చోట్ల మౌలిక వసతుల కల్పన చర్యలు చేపడుతూ వస్తున్నది. నేటికి చాలా చోట్ల ప్రాజెక్టుల వద్ద సరైన సౌకర్యాలు లేవని లబ్ధిదారులు చెబుతున్నారు. ఇండ్ల సముదాయాల్లో మంచినీరు, కరెంటు, రోడ్డు సదుపాయాలు కల్పించలేదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో లిఫ్టులు పనిచేయడం లేదని, విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతుందని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించి డబుల్ బెడ్ రూం ఇండ్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సరైన మౌలిక వసతులు కల్పించాల్సిన చోట అధికారులు పేదలను ఇబ్బంది పెట్టే చర్యలు మానుకోవాలని లబ్ధిదారులు పేర్కొన్నారు.



# నకిలీ పత్రాలతో 8.5 కోట్ల రుణాలు

పాత ఆస్తుల విలువ ఎక్కువగా చూపించి బ్యాంకునే మోసం వేసిన ఏజెంట్లు

క్యాన్‌ఫిన్ హోమ్స్ సంస్థకు టోకరా.. సీసీఎస్‌లో కేసు నమోదు

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ పొందలేని కొన్ని పాత ఆస్తులపై నకిలీ పత్రాలు సృష్టించి రుణాలిచ్చే బ్యాంకునే 8.5 కోట్లు మోసం చేసిన ఇద్దరు ఏజెంట్లపై సీసీఎస్‌లో కేసు నమోదయ్యింది. నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్ రోడ్డులో ఉన్న కాన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ అనే సంస్థ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ). ఈ సంస్థ వివిధ రకాలైన ఆస్తులను తనఖా పెట్టుకొని రుణాలు మంజూరు చేస్తుంది. ఇందులో భాగంగా ఈ సంస్థకు పనిచేస్తున్న ఇద్దరు ఏజెంట్లు వేణు, శ్రీనివాస్‌లు ఒక పథకం ప్రకారం రుణాలు తీసుకోవడానికి పన్నాగం పన్నారు. 1983 కంటే ముందు జరిగిన భూ లావాదేవీలు ఈసీ(ఎన్ కంబరెన్స్ సర్టిఫికేట్)లో కనిపించవు. దీనిని ఆసరాగా చేసుకొని ఘట్‌కేసర్, ఎస్‌ఆర్‌నగర్ బ్రాంచ్‌లలో ఈ ఏజెంట్లు 36 మంది పేర్లపై రుణాలు తీసుకున్నారు. సదరు ఆస్తులకు సంబంధించిన అసలైన డాక్యుమెంట్లను తీసుకొని వాటిపై జీపీఏ చేయించి, అందుకు సంబంధించిన నకిలీ లింక్ డాక్యుమెంట్లు సృష్టించి పథకం ప్రకారం రుణాలు తీసుకున్నారు. 2022 నుంచి 2023 మధ్య ఈ రుణాలు పొందారు.

తక్కువ విలువ ఉన్న ఆస్తులకు నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి వాటి విలువలు ఎక్కువగా చూపించి రుణాలు పొందారు. దీనిపై అనుమానం వచ్చి బ్యాంకులో అంతర్గత విచారణ జరపగా ఈ మోసం బహిర్గతమైంది. ఏజెంట్లు నకిలీ పత్రాలతో రుణాలు పొంది బ్యాంకుకు భారీ నష్టం చేసినట్లు విచారణలో బయటపడింది. తానొక్కడినే నకిలీ పత్రాల ఆధారంగా 15 రుణాలను పొందానని విచారణలో ఏజెంట్ శ్రీనివాస్ ఒప్పుకున్నాడు. ఈ మేరకు బ్యాంకు సీనియర్ మేనేజర్ రాకేశ్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పట్టపగలే నడివీధిలో చైన్ స్నాచింగ్


నేరేడ్‌మెట్, జనవరి 16: బైకుపై వెనక కూర్చున్న ఓ మహిళ మెడలో నుంచి చైన్‌స్నాచర్లు పుస్తెలతాడు తెంపుకొని వెళ్లిన ఘటన నేరేడ్‌మెట్‌లో జరిగింది. నేరేడ్‌మెట్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్‌లో నివాసం ఉంటున్న పూజిత (25) సంక్రాంతి పండుగ కోసం తల్లిదండ్రులు ఉంటున్న స్థానిక గీతానగర్‌కు వచ్చింది. అయితే గురువారం సాయంత్రం మూడున్నరకు చెల్లెలితో కలిసి తన ఇంటినుంచి ద్విచక్ర వాహనంపై సోదరితో కలిసి మెడికల్ షాపుకు బయలుదేరారు. గీతానగర్ రోడ్డు నంబర్ 3లోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తి వెనుకనుంచి ద్విచక్ర వాహనంపై వచ్చి బైకుపై వెనక కూర్చున్న పూజిత మెడలో ఉన్న 2.5 తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని పారిపోయారు. దీంతో పూజిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# హామీల అమలుపై రైతు ధర్నా

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ పోరాటానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే గడిచిన ఏడాది కాలంలో అనేక ధర్నాలు, నిరసన దీక్షలతో ప్రజలు, రైతుల పక్షాన నిలబడిన బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడిక్కడ ఎండగడుతున్నది. అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడగడుగునా నిలదీసుకుంటూ వస్తున్నది. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు కాకపోవడంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్న నేపథ్యంలో రైతుల తరఫున బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి తెరలేపింది. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా, నిరసన దీక్షలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌లో నిర్వహించే రైతు ధర్నా కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ యువనేత పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ రైతు ధర్నా కార్యక్రమ ఏర్పాట్లను కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువనేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి దగ్గరుండి చూసుకుంటున్నారు. రైతులను, ప్రజలను, బీఆర్ఎస్ శ్రేణులను పెద్దఎత్తున తీసుకువచ్చి కేటీఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. - షాబాద్, జనవరి 16

నేడు షాబాద్‌కు రామన్న రాక..

- ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలుపై బీఆర్‌ఎస్ నిరసన దీక్ష
- బీఆర్‌ఎస్ యువనేత పట్నం అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- కార్యక్రమ ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డి
- ధర్నాకు కేటీఆర్‌తోపాటు హాజరుకానున్న మాజీ మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు
- రైతుధర్నాకు భారీగా తరలిరానున్న రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి

### రైతు ధర్నాలో పాల్గొననున్న కేటీఆర్

షాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రైతుధర్నాలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ రైతు నిరసన దీక్షలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు తదితరులు హాజరుకానున్నారు. ఇప్పటికే అప్పా జంక్షన్ నుంచి షాబాద్ వరకు కేటీఆర్‌కు స్వాగతం పలుకుతూ అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతమంతా గులాబీమయంగా మారింది. రైతు ధర్నాలో పాల్గొనే అన్నదాతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

### అన్నదాతల సమస్యలపై బీఆర్‌ఎస్ పోరాటం

రాష్ట్రంలో రైతుల సమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో రైతుల పక్షాన ధర్నాలు, దీక్షలు నిర్వహించి అండగా నిలుస్తున్నది. రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గతేడాది ఆగస్టులో చేవెళ్లలో నిర్వహించిన రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ప్రస్తుతం రైతులకు ఇప్పటికే వానకాలం రైతు భరోసా డబ్బులు ఎగ్గొట్టిన ప్రభుత్వం.. యాసంగి పంటకు అనేక కొర్రీలు పెట్టి రైతు భరోసా అందిస్తామని ప్రకటనలు చేయడంతో రైతుల పక్షాన మరోసారి బీఆర్‌ఎస్ పోరాటానికి సిద్ధమైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అదునుకు రెండు పంటలకు రైతు బంధు డబ్బులు అందించడంతో ఎవరిపైనా ఆధారపడకుండా రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకునేవాళ్లని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతుండడంతో వారికి అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి ముందుకు వెళ్తున్నది.

## రుణమాఫీ జరిగింది 35 శాతమే..

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

చేవెళ్ల రూరల్, జనవరి 16 : రాష్ట్రంలో 35 శాతానికి మించి రైతు రుణమాఫీ జరుగలేదని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆరోపించారు. గురువారం చేవెళ్ల మండల పరిధి కేసారం గ్రామ రెవెన్యూలోని బృందావన్ కాలనీలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలు ఇచ్చారని, గ్యారంటీ కార్డులు కొట్టించి మరీ కాంగ్రెస్ నేతలు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక ఉచిత బస్సు తప్పా ఏ హామీలూ అమలు కాలేదని మండిపడ్డారు. ఆగస్టు 15న బహిరంగ సభలో రుణమాఫీ పూర్తయినట్లు ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఏ గ్రామంలోనూ 35 శాతానికి మించలేదని విమర్శించారు. అంతకుముందు మంత్రులు ఒకసారి రూ.46 వేల కోట్లని, కేబినేట్ మీటింగ్ పెట్టి రూ.42 వేల కోట్లని, మరోసారి రూ.26 వేల కోట్లని మూడు రకాలుగా మాట్లాడారని మండిపడ్డారు. చివరికి రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని ప్రకటించి.. రైతుల అకౌంట్లలో రూ.7 వేల కోట్లే జమ చేశారని ఆరోపించారు. తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన కొడంగల్ నియోజకవర్గంలోని ఏ గ్రామమైనా తీసుకొని గ్రామ సభ పెట్టి హామీలపై చర్చిద్దామని సీఎం రేవంత్‌రెడ్డికి చాలెంజ్ చేశానని గుర్తుచేశారు. కనీసం 40 శాతం హామీలన్నా అమలైనట్లు తేలితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రకటించానని, అయినా సీఎంకు చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. కేసీఆర్ ఎకరాకు రూ.5 వేలు ఇస్తే రేవంత్‌రెడ్డి రూ.7,500 ఇస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు రూ.5 వేలకు కూడా దిక్కులేదని ఎద్దేవా చేశారు. రైతు బంధు, రుణమాఫీ, 4వేల పింఛన్, తులం బంగారం ఇలా ఏ హామీ అమలు కావడం లేదన్నారు.

## రైతుల తరఫున కొట్లాడబోతున్నాం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్ నుంచి ప్రారంభం కానున్న రైతు దీక్షలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతాయని ప్రకటించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, రైతుల తరఫున కొట్లాడాలని మాజీ సీఎం కేసీఆర్ చెప్పిన కార్యక్రమం కాబట్టి భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. చేవెళ్లకు ఒక చరిత్ర ఉందని, ఏ పార్టీ ఏ కార్యక్రమం తీసుకున్నా ఇక్కడి నుంచి మొదలు పెడితే సక్సెస్ అవుతుందన్నారు. రైతుల తరఫున కొట్లాడబోతున్నాం కాబట్టి తప్పకుండా విజయం చేకూరుతుదని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ చేవెళ్ల, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు ప్రభాకర్, గోవర్ధన్ రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశమోళ్ల ఆంజనేయులు, షాబాద్ మాజీ జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు విఘ్నేశ్ గౌడ్, శేఖర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, భరత్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, రామాగౌడ్, నర్సింహులు, కెప్టెన్ అంజన్‌గౌడ్, బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్‌ఘనీ, మాజీ ఎంపీటీసీ ఎల్లన్న, బీఆర్‌ఎస్ నాయకులు సత్యం, జంగారెడ్డి, వీరాంజనేయులు, నవీన్, వీరస్వామి, నర్సింహులు, సుదర్శన్, ఆసిఫ్ పాల్గొన్నారు.

# వీడియో వివాదం హత్యలకు దారితీసింది

వీడిన నార్సింగి జంట హత్యల మిస్టరీ

మృతులపై కక్ష గట్టిన నిందితులు

పథకం పన్ని పిలిచి.. హత్య

ఘటన జరిగిన వెంటనే మధ్యప్రదేశ్ పరార్

ఫోన్ నంబర్ల ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): నగరంలో కలకలం సృష్టించిన నార్సింగి జంట హత్యల కేసును పోలీసులు చేధించారు. మృతురాలు ఏకాంతంగా ఉన్న సమయంలో వీడియో తీయొద్దని హెచ్చరించినందుకు కక్ష గట్టిన నిందితుడు ఈ జంట హత్యలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన అంకిత్ సాకేత్, ఛత్తీస్‌గఢ్ చెందిన బిందుల మధ్య వివాహేతర సంబంధం ఉండేది. ఇదే క్రమంలో అంకిత్ ద్వారా మధ్యప్రదేశ్‌కే చెందిన రాహుల్ సాకేత్‌తో బిందుకు సాన్నిహిత్యం ఏర్పడింది. ఇద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో రాహుల్.. బిందు వీడియోను రికార్డు చేసేందుకు యత్నించగా ఇందుకు ఆమె అభ్యంతరం చెప్పింది. వద్దని బిందు వారించినప్పటికీ రాహుల్ పలుమార్లు ఆమె వీడియో తీసేందుకు పదే పదే యత్నించాడు. ఈ విషయమై రాహుల్‌ను అంకిత్ తీవ్రంగా మందలించాడు. మరోమారు ఇలా చేస్తే తగదని కూడా హెచ్చరించాడు. దీంతో అంకిత్‌పై రాహుల్ కక్ష గట్టి అతడిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం తన స్వస్థలానికి చెందిన రాజ్‌కుమార్ సాకేత్, సుకేందర్ సాకేత్‌ల సహాయం కోరాడు. పథకం ప్రకారం ఈ నెల 8న అంకిత్‌ను, బిందును నానక్‌రామ్‌గూడకు రప్పించుకున్నారు. అక్కడి నుంచి అందరూ కలిసి ఆటోలోని పుప్పాలగూడలోని పద్మనాభ స్వామి గుట్టపైకి తీసుకెళ్లారు. అక్కడ వారితో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ.. రాహుల్, రాజ్‌కుమార్‌లు కలిసి అంకిత్‌ను పక్కకు తీసుకెళ్లి కత్తులతో దాడి చేసి బండరాళ్లతో మోది చంపేశారు. అదే సమయంలో సుకేందర్.. బిందును మాటల్లోకి దింపి పక్కకు తీసుకెళ్లాడు. అంకిత్‌ను చంపిన వెంటనే.. రాహుల్, రాజ్‌కుమార్‌లు సుకేందర్‌తో కలిసి బిందును అతి దారుణంగా చంపేశారు. ఆ తర్వాత నిందితులు మృతుల సెల్‌ఫోన్‌లను తీసుకుని అక్కడి నుంచి తమ స్వస్థలమైన మధ్యప్రదేశ్‌కు పరారయ్యారు.

### సెల్‌ఫోన్‌లు పట్టించాయి

పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు నిందితులు మృతుల ఫోన్‌లు తమ వెంట మధ్యప్రదేశ్ తీసుకెళ్లారు. అయితే దర్యాప్తులో భాగంగా పోలీసులు మృతుల సెల్‌ఫోన్‌ల గురించి వాకబు చేయగా అవి ఘటనా స్థలంలో లభించలేదు. ఫోన్ నెంబర్‌ల ఆధారంగా వారి వారి లొకేషన్‌లు వెతకగా నిందితులు మధ్యప్రదేశ్‌లో ఉన్నట్టు తేలింది. ఈ క్రమంలో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని మధ్యప్రదేశ్‌లోని సిద్ధి జిల్లాకు వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి మృతుల సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# ఎన్యుమరేటర్లకు బల్దియా చుక్కలు!

సర్వేలో పాల్గొన్న వారంతా నగదు కోసం ఎదురుచూపులు

బడ్జెట్ లేదంటూ దాటవేస్తున్న జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో నెల రోజులకు పైగా అహర్నిశలు కష్టపడిన ఎన్యుమరేటర్లకు బల్దియా చుక్కలు చూపిస్తున్నది. సర్వేలో భాగస్వామ్యం చేసిన అధికారులు వారికి చెల్లించాల్సిన నగదును సకాలంలో ఇవ్వడం లేదు. ఆదేమంటే బడ్జెట్ లేదంటూ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా వాళ్లను ప్రదక్షిణలు చేయిస్తున్నారు. గ్రేటర్‌తో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో దాదాపు 23, 194 మంది ఎన్యుమరేటర్లు 28, 28, 682 గృహాలపై సర్వే చేశారు. స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జి) మహిళలు, టీచర్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది కలిపి ఎన్యుమరేటర్లగా బాధ్యతలు అప్పగించారు. సర్వేలో పాల్గొన్నందుకు ఎనుమలేటర్లకు రూ.10వేల పారితోషికం, సూపర్‌వైజర్లకు రూ.12వేలు అందించాలని నిర్ణయించారు. కానీ రెండు నెలలు కావొస్తున్నా వారికి చెల్లించాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు.

ఈ నేపథ్యంలోనే ఎన్యూమరేటర్లు కమిషనర్ ఇలంబర్తి దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నారు. సకాలంలో చెల్లించకుంటే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఎన్యూమరేటర్లకు తోడుగా ఆపరేటర్లు సైతం ఈ జాబితాలో ఉండడం గమనార్హం.